# చివరకు మిగిలేది

– ఆదెళ్ళ శివకుమార్

ఎత్తయిన నల్లకర్రతో చేసిన ఖరీదైన టేబుల్ మీద

పాలమీగడలాంటి పట్టుపరుపు ...

పన్నీటి వాసనలు కలిసిన గాలిలో తేలుతున్న ఊదొత్తుల పొగ మేఘాలు ...

భుజాల వరకూ కప్పిన తెల్లటి దుప్పటి క్రింద గులాబీ దండల మధ్య వున్నది

నా శరీరమైతే, హాల్లో ఫ్రిడ్జ్‌మీద కూర్చున్న నేనెవరిని?

సెంట్రల్లీ ఎయిర్‌కండిషన్డ్ హాల్లో క్రిక్కిరిసిన జనసందోహం.

వచ్చేవాళ్ళు వస్తుంటే పోయేవాళ్ళు పోతుంటే వాళ్ళకేం బాధ? అంతంత బరువైన దండల్ని మోస్తుంది నా శరీరమేగా?

నాకంతా విచిత్రంగా వుంది. గత పద్దెనిమిది గంటల్నుంచి నాకు పిచ్చెక్కినట్లుగా వుంది.

ఈ టైంలో స్టూడియోలో వుండాల్సినవాడిని. నిర్మాతలు, దర్శకులు, తోటి నటీనటులూ, యూనిట్‌మెంబర్స్, కెమెరా, రిఫ్లెక్టర్స్, హీరోయిన్ మధ్య వెలిగిపోతూ వుండేవాడు కానీ గత పద్దెనిమిది గంటల్నుంచి ఆ టేబుల్ మీద అలా కదలకుండా, మెదలకుండా పడివుండవల్సిరావటానికి కారణం నేను చచ్చిపోవటమేనా?

అక్కడ వుంది నా శరీరమైతే ఇక్కడ వుంది నా ఆత్మనా?

అక్కడ వుంది నా శరీరమైతే ఇక్కడ వుంది నా ఆత్మనా?

అంటే మనిషి చచ్చిపోయాక కూడా వాడి తాలూకు ఆత్మ ఇలా ఫ్రిడ్జ్‌లమీద, షాండ్లియర్లమీద, కప్పలమీద కూర్చుని అంతా తాపీగా చూస్తూ, వింటూ వుంటుందా?

అవును డౌటేం అక్కరలేదు నేను చచ్చిపోయి ఆత్మగా మారిపోయి ఇక్కడ సెటిలయ్యాను.

వార్నీ! ఇదే విషయం బ్రతికుండగా నాకు తెలిసి వుంటే ఓ అద్భుతమైన ఫిక్షన్ సినిమా స్వంతంగా తీసేవాడిని.

గాలిలోంచి ఆత్మలాగా హీరో రావటం, విలన్స్‌తో ఫైట్స్, హీరోయిన్ బాత్రూంలో వుంటే లోపలకు దూరి రోమాన్స్ చేయటం ... విషయం అర్థంకాక జనాలు దడుచుకుచావటం ... ఖచ్చితంగా వందరోజుల పిక్చర్ అయ్యేది.

కానీ ఏంచేసేది? బ్రతికుండగా తెలీలేదు, చచ్చాక సినిమా తీయలేను మంచి సబ్జెక్ట్ మిస్సయ్యాను.

సినిమా సంగతి తర్వాత కానీ ఈ హింసేమిటి? అందరూ నాకు కన్పిస్తున్నారు, వాళ్ళేం మాట్లాడుతుందీ విన్పిస్తుంది.

అంతకంటే చిత్రంగా లోపలవాళ్ళేం అనుకుంటుందీ కూడా విన్పిస్తుంది.

కానీ నన్ను ఎవ్వరూ పట్టించుకోవటంలేదు. నేను కూర్చున్న ఫ్రిడ్జ్‌లోంచి జ్యూస్‌లు త్రాగుతున్నారు. నేను చెబుతుంది వినిపించుకోవటంలేదు. వాళ్ళు కన్పించి, వినిపిస్తున్నా నేను వాళ్ళకు కన్పించను, విన్పించనన్నమాట.

ఇదేం ఫిటింగ్? ఇలా ఎంతకాలం బ్రతకాలి నేను?

సర్లే ఇలా ఫ్రిడ్జ్‌మీద కూర్చొని బోర్ కొడుతుంది. నా పెళ్లాం పిల్లలు ఎలా వున్నారో చూస్తాను.

నేను ఇలా సడన్‌గా 'హార్ట్‌ఎటాక్'తో చచ్చిపోయేసరికి వాళ్ళెంత బాధపడుతున్నారో? తనంటే ప్రాణం పెట్టేవాళ్ళు తను చెప్పిందే చేసే వాళ్ళు. తనంటే విపరీతమైన భయభక్తులు ప్రదర్శించేవాళ్ళు.

అవును తను మాత్ర వాళ్ళకు తక్కువ చేసిందేమిటి? ఒక సినిమా హీరోగా దాదాపు రెండొందల కోట్లు సంపాదించాను. బంగళాలు, కార్లూ, సంఘంలో హోదా, గౌరవ మర్యాదలూ, ఫైవ్‌స్టార్ హోటళ్ళూ, ఇంద్రభోగం వాళ్ళు అనుభవించేలా చేశాను.

నేను పోయినా వాళ్ళ ఎన్ని తరాలయినా మహారాజుల్లా బ్రతకటానికి ఎంతో కష్టపడి సంపాదించాను. అందుకోసమైనా వాళ్ళు తనంటే ప్రాణం పెడతారు. తను పోయిన బాధ వాళ్ళు ఎలా భరించగలుగుతున్నారు? నాకు దుఃఖం కలుగుతుంది.

నా చావు కారణంగా వాళ్ళెంత బాధపడుతున్నారో?

అరే! వచ్చిందెవరు పెద్దమ్మాయి సునీత కదూ? పాపం వాళ్ళమ్మను పట్టుకుని ఎలా ఏడుస్తుందో చూడు. నేనంటే ఎంత ప్రేమ? అల్లుడేంటి అలా సీరియస్‌గా వున్నాడు? కోపంగా వున్నాడా? అయినా అతనికెందుకు కోపం? సంవత్సరం క్రితం పెళ్ళికి తాను రెండు కోట్లు కట్నం ఇచ్చాడే డాక్టర్ కాబట్టి మద్రాస్‌లో హాస్పటల్, బంగళా కట్టించి ఇచ్చాడుగా అయినా ఎందుకంత కోపం అతనికి?

నాకిద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు ... పెద్దబ్బాయికి ఎక్స్ ఎం.పీ కూతురితో, పెద్ద అమ్మాయికి ఫారిన్ రిట్నడ్ డాక్టర్‌తో పెళ్ళి చేశాను. ఇంకా పెళ్ళికి ఇద్దరున్నారు. ఈ లోపలే తాను చచ్చిపోయాడు. అసలు నా వయస్సెంతనీ నలభై ఎనిమిది సినిమా ప్రకారం అయితే. ఒరిజినల్‌గా యాభై అయిదు మొన్నే వెళ్ళింది. చాలామంది నా అభిమానులకు నాకింత పెద్ద పిల్లలున్నారని తెలీదు.

ఎక్సర్‌సైజులు, మేకప్‌లతో కుర్రహీరోయిన్లతో యాక్ట్ చేయటంతో నా వయస్సు ఎప్పటికప్పుడు తక్కువగా కన్పించేలా చేసుకునేవాడిని.

ఇల్లంతా కిక్కిరిసిపోయి వుంది. ఎంతెంతమంది ప్రముఖులో వస్తున్నారు. దండలు వేస్తున్నారు. శ్రద్ధాంజలి ఘటించి వెళ్తున్నారు ...

నిర్మాతలు, డైరెక్టర్లూ, ఆర్టిస్టులూ, సినిమా తాలూకు జనం, రాజకీయవేత్తలు, సంఘంలోని ప్రముఖులు వస్తున్నారు వెళ్తున్నారు.

నేను ఇంతమందికి తెల్సునా? నాకింత పావు

లారిటీ వుందా? నేను చచ్చిపోతే ఇంతమంది బాధపడుతున్నారా?

వస్తుందెవరు వినోద్ కదూ? ప్రక్కనుంది విజయనా? నాకు అంతులేని ఆశ్చర్యం వేసింది. వినోద్ వృత్తిరీత్యా నాకు శత్రువు. మా ఇద్దరి మధ్యా వున్న శతృత్వం ప్రపంచానికంతటికీ తెలుసు. సినిమాల్లో మాది హోరాహోరి పోరాటం. అతనిదొక సినిమా హిట్ అయితే నాకు నెలరోజులు నిద్రపట్టేది కాదు. నువ్వా నేనా? అంటూ మా 'స్టార్‌వార్' సాగుతూ వస్తుంది.

నా శరీరంమీద చందనపుమాల వుంచి శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు వినోద్ కళ్ళు మూసుకున్నాడు.

కెమేరాలు క్లిక్‌మన్నాయి. "వృత్తిరీత్యా శతృత్వం వున్నా మానవత దృష్ట్యా ఎంత ఎత్తుకు ఎదిగిపోయారు వినోద్" అంటున్నాడొక వ్యక్తి. చూస్తే ఏకాంబరం. నా ప్రొడ్యూసర్. మొన్నటిదాకా నా దగ్గర వినోద్‌ని నీచంగా తిట్టినవాడు ఈరోజు అటువైపు పొక్కుంటూ వెళ్ళిపోతున్నాడు. నాకు వళ్ళుమండింది. ఏవో మాటలు విన్పించేసరికి చెవులు రిక్కించాను.

శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టు వినోద్ నా శవం ముందు నిలబడి కళ్ళు మూసుకున్నా అతడు మనస్సులో ఏమనుకుంటుందీ నాకు స్పష్టంగా విన్పించసాగింది.

"ఒరేయ్ దొమ్మరి నాయాలా ... నాకు డాన్సులు చేయటం రాదని నీ సినిమాల్లో బ్రేక్ డాన్సులూ, అవీ ఇవీ పెట్టి నన్ను డామినేట్ చేశావు కదరా. నాకు మంచి పాత్రలు రాకుండా, మంచి హీరోయిన్స్ లేకుండా, ప్రొడ్యూసర్స్ మంచివాళ్ళు పడకుండా రాజకీయాలు చేశావు కదరా ... ఇప్పుడేమైపోయావు ... చావరా నాకొడకా ... ఇంటికిపోయి షాంపైన్ పార్టీ చేసుకుంటా."

నా శవం ముందు నిలబడి వాడు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాడని అందరూ అనుకుంటారు కానీ వాడు బండబూతులు తిడుతున్నాడని నా ఒక్కడికే తెలుసు.

వాడిని తన్నాలని పిడికిలి బిగించి గుద్దాను. లాభం లేకపోయింది నా చేయి శూన్యంలో తేలిపోయింది. నా అసహాయతకు నాకే ఏడుపు



వస్తుంది. నా ముందే నన్ను బండబూతులు తిడుతున్నా ఏమీ చేయలేకపోతున్నాను.

నేను చచ్చిపోయేసరికి మొన్నటిదాకా నాకు శరీరంతో సహా సర్వం అర్పించిన హీరోయిన్లు వినోద్‌గాడి చుట్టూ తిరుగుతున్నారు. వాడిని నీచంగా తిట్టిన నా తాలూకు ప్రొడ్యూసర్స్ వాడికి భజన చేస్తూ వాడితో సినిమాలు తీయటానికి ట్రయ్ చేస్తున్నారు.

"సోదరుడు భరత్ మృతి తీరని లోటు. పెద్దన్నయ్యలాంటి ఆయన నాకు ఎన్నో విషయాలలో సలహాలు ఇచ్చేవారు. మన దేశానికి ఆస్కార్ సాధించగల ఏకైక హీరో ఆయన. అలాంటిది ఆయన పోవటం ..." వినోద్ కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నాడు.

కెమెరా ముందు చేయాల్సిన యాక్టింగ్ ప్రెస్ రిపోర్టర్స్ ముందు చేస్తున్నాడు. ఈ వెధవలు అదే చకచకా వ్రాసేసుకుంటున్నారు.

ఛీ ... ఛీ కృతజ్ఞత లేని నీచులు ... తనతో సినిమాలు తీసి కోట్లు సంపాదించిన నిర్మాతలు ... పేరు, డబ్బు చేసుకున్న డైరెక్టర్లు, రచయితలూ, ఎక్స్‌ట్రా వేషాలు వేసేవాళ్ళను తను ఎంకరేజ్ చేసి టాప్ హీరోయిన్స్ చేస్తే వీళ్ళందరూ ఇంతకాలం తనను ఇంద్రుడు, చంద్రుడు అని పొగిడి ఈరోజు తాను చచ్చిపోయేసరికి పైపై నక్కఏడ్పులు ఏడుస్తూ తన శత్రువులతో చేతులు కలుపుతున్నారు.

వీళ్ళ బుద్ధులే అంత ... పైగా పరామర్శించడానికి వచ్చిన రాజకీయవేత్తలు, మిగిలినవాళ్ళు "ఈ ఇల్లు ఎంత చేస్తుందా? వీడెంత సంపాదించాడా, వీడంత మేము సంపాదించగలమా? లేదా?" అని ఏడ్చేవాళ్ళే కానీ ఒక్కడు కూడా నిజంగా బాధపడుతున్నవాళ్ళు లేరు.

ఇంతకాలం తన మందుపార్టీలు, డబ్బుతో బ్రతికిన జర్నలిస్టులు ఈరోజు వినోద్‌గాడి చుట్టూ తిరుగుతున్నారు.

పోనీ తన ఫాన్స్ అయినా సరిగ్గా తగలబడ్డారా అంటే లేదు ... ఓ వెయ్యిమంది దాకా అభిమానులు వచ్చారు. 'భరత్‌భూషణ్ అమర్ రహే' 'డేరింగ్ స్టార్ భరత్‌భూషణ్ జిందాబాద్' 'లాంగ్ లివ్ భరత్ భూషణ్' అంటూ అరుస్తున్నారు.

నేను ఎంతో ఆనందంతో పోర్టికోలోకి వెళ్ళాను. వాళ్ళకు నేను కన్పించనుకదా అయినా వాళ్ళను చూస్తే నాకు ఎంతో బాధ కలిగింది. నా కోసం ఎంతో దూరం నుంచి, ఎంతో కష్ట

● ●

లక్ష టన్నుల అణుబాంబు నా మీద పేల్చినట్టుగా అన్పించింది నాకు. ఏమిటినేను వింటున్నది? నిజమేనా? నా చెవులు నన్ను మోసం చేస్తున్నాయా.

● ●

పడి వచ్చారు వీళ్ళు. ఏమిచ్చి వీళ్ళ ఋణం తీర్చుకోగలను నేను?

కొద్దిసేపు అక్కడే వుండేసరికి నా ఈ ఫీలింగ్స్ అన్నీ మారిపోయాయి. వినోద్ వెంట వచ్చిన విజయని చూసి కొందరు

"బాసు మంచి మంచి ఫిగర్స్‌ను లాగించేవాడు కదా ... ఇప్పుడు ఫాన్స్ వినోద్‌గాడు కొట్టేశాడు" నా రెండవ కుతురు వినీలను చూసి కొందరు "ఏం వుంది బాసూ ఉస్కులకిడి అద్దిరిపోయిందనుకో ..." అంటున్నారు.

ఈ వెధవల కామెంట్స్ వింటుంటే నాకు నిప్పుల్లో కూర్చున్నంత మంటగావుంది. "ఒరి ప్లాట్‌ఫారం వాయాళ్ళారా. .. నేను చచ్చిపోతే బాధపడాల్సిందిపోయి ఏ హీరోయిన్‌కి ఏ హీరోతోఓ లంకె వుంది? నా కూతురు పిటపిటలాడిపోతుందని కామెంట్స్ చేస్తారా?"

ఇంతకు ముందు ఆప్తబంధువులులాగా అనిపించిన నా అభిమానులు నా కిప్పుడు తోకలేని కోతిమూకలా కన్పిస్తున్నారు. ఛీఛీ... బైట వెధవలు అందరూ అంతే... పై పై ఆప్యాయతలు నటించేవాళ్ళే... ఈ నీచుల గురించి పట్టించుకోవటం అనవసరం... ఎంతయినా రక్తసంబంధం రక్తసంబంధమే. నావాళ్ళకుండే అభిమానం, బాధా వీళ్ళకెందుకుంటాయి? ఇక నుంచి నావాళ్ళనే అంటిపెట్టుకుని వుంటాను... ఏదీ నా భార్య? నేనంటే అమితంగా ప్రేమించే భార్య... నా కోసం ప్రాణం అయినా ఇచ్చే నా భార్యేదీ? అమ్మయ్య... పైన బెడ్‌రూంలో కన్పించింది నా భార్య పెద్దకూతురు సునీతతో. సునీ ఏదో చెబుతుంది. బహుశా నేను పోవటం వల్ల తాను ఎంత బాధపడుతుందీ చెబుతుందేమో. ఇదిగో వింటాను –

"సీరియస్‌గా వుండక ఇంక ఎలా వుంటారు? ఇక్కడ హైద్రాబాద్ బంజారాహిల్స్‌లో లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌తో హాస్పిటల్ కట్టించి ఇస్తానని నాన్న చెప్పారు... నాన్న పోయేసరికి విజ్జీగాడిని అడిగితే నాకేం తెలీదు. మేమే అప్పుల్లో వున్నాం అంటున్నాడు... ఆయన ఎన్నో ఆశలు పెట్టుకుని ఫ్రెండ్స్ అందరికీ చెప్పుకున్నారు... మరి ఆయనకు కోపం రాకేం చేస్తుంది?"

"ఆస్తిపాస్తుల విషయాలు నాకేం తెలుసు తల్లీ? వంటి మీద నగలు... బ్యాంకులో పాతిక వేలు బ్యాలన్స్ తప్ప నా దగ్గర ఏముంది? మీ నాన్నగారు చెప్పినట్టు చేయాలని వున్నా నేనేం చెయ్యగలనమ్మా... మీ నాన్నగారు ఏనాడు నా గురించి పట్టించుకున్నారు..."

లక్ష టన్నుల అణుబాంబు నా మీద పేల్చినట్టుగా అన్పించింది నాకు. ఏమిటి నేను వింటున్నది? నిజమేనా? నా చెవులు నన్ను మోసం చేస్తున్నాయా?

నా భార్యాబిడ్డలు నా చావు గురించి తీవ్రమైన దుఃఖంతో బాధపడుతున్నారనుకున్నాను. కానీ వాళ్ళు చర్చిస్తుంది ఆర్థిక సంబంధమైన విషయాలనా? నేను సునీత భర్తకు బంజారాహిల్స్‌లో హాస్పిటల్ కట్టిస్తానని చెప్పానా? ఎంత అబద్ధం? నేను పోయేసరికి నేను చెప్పని విషయాలను నేను చెప్పినట్టుగా నాటకం ఆడి వచ్చినంత లబ్ధి పొందాలని కదూ సునీ ప్లాన్? మరి నా భార్య సంగతి? నాతిచరామి అంటూ ఉచ్చరించి నా భార్యను జీవితంలోకి తెచ్చుకున్నాను. ఏలోటూ చేయలేదు. ముందు జాగ్రత్తగా ఆమె పేరిట దాదాపు నలభై కోట్ల ఆస్తి వుంచాడు తను. అలాంటి తన భార్య ఎంత తేలిగ్గా అబద్ధం ఆడుతుంది? "మీ కోసం నా ప్రాణాలైనా ఇస్తానండీ" అన్న తన భార్య ఈ రోజు కూతురితో "నాన్న పోగానే ఆస్తి విషయాలేమిటి?" అని చీవాట్లు పెట్టాల్సింది. నా దగ్గరేముంది? మీ నాన్న నాకేం ఇచ్చాడు అంటుంది. ఆహా! ఎంతటి ముందు

చూపు. అవునుమరి నేను పోయినా ఆవిడకు కార్లూ, ఎ.సీ.లు, నగలూ, ఫారిన్ టూర్లు కావాలి కనుక ఆ మాత్రం ముందుచూపు వింతేముంది. ఇంతలో వినీల వచ్చింది... "అమ్మా... సీయంగారు వచ్చారు. మవ్వోసారి క్రిందకు రావాలి". నా భార్య లేచి 'టీ.వి. వాళ్ళు కూడా వచ్చారా?' అంటూ వార్డ్‌రోబ్ లోంచి నల్లంచు తెల్లచీర తీసి కట్టుకుని లైట్ మేకప్ ముగించుకుని పిల్లలతో కలిసి క్రిందకు వెళ్ళిపోయింది.

ఆ గదిలో నేను ఒక్కడినే మిగిలాను.

ఓహో నా ముద్దుల పెళ్ళామా... రేపు టీ.వీ.లో లక్షలాది మందికి కన్పించబోతున్నావుగా అందుకని ఆ మాత్రం ముస్తాబు కావాలిలే. అయినా ఏ ఒక్కడైనా మొగుడుపోతే ఈవిడేంటి ఇంత ట్రిమ్‌గా తయారయింది అని నీ ముఖాన ఉమ్మెయ్యరా? వెయ్యరులే. వీళ్ళు మనుషులు కదా. అంత దూరం ఆలోచించరు. స్మశానంలో చితి మీద శవం కాలుతుంటే తల దువ్వుకుంటూ, పౌడర్ అద్దుకునే మనుషులున్న మానవజాతి కదా ఇది?

ఈ ఆడవాళ్ళంతా ఇంతే. వీళ్ళకు ప్రేమా, అభిమానం, ఫీలింగ్స్ వుండవు. నగలు, పట్టుచీరలు, ఐశ్వర్యం తప్ప వీళ్ళకు ఏమీ అక్కర్లేదు. నా కొడుకులేరీ? పెద్దకొడుకు విజయ్ క్రింద హాల్లో ఎవరితోనో సీరియస్‌గా వాదిస్తున్నాడు.

"మర్యాదగా ఆ పధ్నాలుగు లక్షలు బ్యాలెన్స్ ఎమౌంట్ పంపించేయటం మీకే మంచిది... నా ప్రొడ్యూసర్ రామలింగంతో అంటున్నాడు. మధ్యలో వుంది నా సెక్రటరీ కనకారావు. వాదన వేడిగా సాగుతోంది. విషయం అర్థమైంది నాకు. నేను హఠాత్తుగా పోయేసరికి సెక్రటరీ వ్యవహారాలు, ఎమౌంట్లు తారుమారుచేసేసాడు. ఎంత దుర్మార్గం? ట్యాంక్‌బండ్ మీద తేగలు అమ్ముకునేవాడు ఈ రోజు టై, బూటు వేసుకుని ఎంత రాజకీయం నడుపుతున్నాడు?

"ఏమైంది అల్లుడూ?" అంటూ వచ్చినవాడు నా భార్య రెండో అన్న జగదీశ్వరరావు. "ఏముంది మామయ్యా... ఆ ముసలాయన ఒక పని చేస్తాడా? రెండు కోట్ల ఎనభై లక్షల ఎమౌంట్స్ రావాలి. ఇచ్చావని వీళ్ళు, ఇవ్వలేదని కనకం చెబుతున్నారు... ఛీ... ఛీ... ఈ వ్యవహారాలతో నాకు పిచ్చెక్కిపోతుంది. చచ్చి ఆయన బాగానే వున్నాడు... బ్రతికి నేను

స్మశానంలో ఎండిపోయిన చెట్టు మీద కూర్చుని తగులబడుతున్న నా శవం వైపు చూడసాగాను. ఏముందక్కడ? ముందు చర్మం కరిగిపోయింది. జుట్టు కాలిపోయింది.

చస్తున్నాను. సునీకి ఇక్కడ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కట్టిస్తానని చెప్పాడంట. అది నన్ను చంపుతుంది... తీర్చాల్సిన అప్పుల సంగతి ఎవ్వరూ పట్టించుకోరు..." పెద్ద కొడుకు ధుమధుమలాడుతున్నాడు.

అప్పులా? నేను అప్పు చేయాల్సిన కర్మేమిటి? ఇది నీ సృష్టా పెద్ద కొడకా? నీకు కార్లూ, రేసులూ తప్ప ఏమీ తెలీదనుకున్నాను. ఇంత మేధావివి ఎప్పుడయిపోయావురా నాయనా?

కోడలు మహిళామండలి బ్యాచ్‌ను వేసుకుని కొనబోయే బెంజ్‌కారు గురించి చెబుతుంది.

చిన్నకొడుకు కోసం వెతగ్గా, వెతగ్గా ఆఖరకు మూలనున్న ఈ రూమ్‌లో కన్పించాడు. ప్రక్కనుంది ఆర్ట్ డైరెక్టర్ అమ్మాయి. వాడు పీకల దాకా త్రాగేసి వాగుతున్నాడు "నీ స్ట్రక్చర్ చూస్తుంటే నా గుండె ఆగిపోతుంది డియర్... పోయినవాళ్ళ కోసం మనం పోతామా, బ్రతికినంత కాలం బ్రతకక తప్పదు." ఆహా! ఏమి వేదాంతం చెబుతున్నావురా? జిడ్డు కృష్ణమూర్తి, అరిస్టాటిల్ వచ్చి నీ దగ్గర నేర్చుకోవాలిరా ఫిలాసఫీ త్రాగుబోతు నా కొడకా? తండ్రి చచ్చి శవం ఇంట్లో వుంటే అమ్మాయిలతో శృంగారం నడిపే నువ్వురా అసలు కొడుకంటే...

బ్రతికి వున్నవాడు ఇవన్నీ చూస్తే ఆత్మహత్య చేసుకుని చస్తాడు. మరి చచ్చిన నేనేం చేయాలి? ఉరి వేసుకోవాలా? రైలుక్రింద పడాలా? విషం మింగాలా?

ఎంతటి నికృష్టమైన పరిస్థితి ఇది? ఇన్ని కోట్లుఆస్తీ, ఇంత మంది బలగం, ఇంత పేరుప్రఖ్యాతులూ ఇవన్నీ క్షణభంగురాలేనా?

సాయంత్రం నాలుగున్నర సమయంలో నా శవం అలంకరించిన వాహనం మీదకు చేరింది. దారి పొడుగునా వేలాది మంది జనం.

అందరితోపాటు నేనూ శ్మశానాన్ని చేరాను. అందరూ ఎంతో నిశ్శబ్దంగా, బాధగా వున్నారు.

ఓ కెమెరా అంతటినీ చిత్రిస్తుంది. "మనిషి చావులోంచి కూడా ఆర్థిక లబ్ది పొందగల మానవ మేధావులారా వర్ధిల్లండి."

గంధం చెక్కల మధ్య వుంచిన నా శవానికి నా పెద్దకొడుకు కొరివి పెట్టాడు. నేను పోగానే దొంగ అప్పులు సృష్టించి ఆస్తిని నొక్కేయాలని పథకం నడుపుతున్న నా పెద్ద కొడుకు ఎంతో బాధగా, వేదనగా కన్పించడం చూసి "నేనే మహా నటుడిని అనుకున్నాను కానీ నా ఇంట్లో నన్ను మించిన నటులున్నారన్నమాట" అనుకున్నాను.

స్మశానంలో ఎండిపోయిన చెట్టు మీద కూర్చుని తగలబడుతున్న నా శవం వైపు చూడసాగాను. ఏముందక్కడ? ముందు చర్మం కరిగిపోయింది. జుట్టు కాలిపోయింది. కండలు వేడికి కాలిపోవడం మొదలుపెట్టింది. ఎగిసిపడుతున్న అగ్నిజ్వాలల మధ్య నా దేహం బూడిదైపోయింది. నా కపాలం ప్రేలిపోయాక అందరూ వెళ్ళిపోయారు. కాటికాపరి మాత్రం బీడీ వెల్గించుకుని దూరంగా పోయి కూర్చున్నాడు. నేను నా కళ్ళతో నా దేహం దగ్ధం కావడం చూశాను. ఇంతకాలం నాతో వుండి నేడు బూడిదైపోయింది.

కసరత్తులు చేసి, క్రీములు రాసి, యాపిల్ జ్యూస్‌లు, ఎ.సీ. రూమ్‌లలో పెంచి పోషించిన దేహం బూడిదైపోయింది... ఏమిటో ఈ మానవ జీవితం? పుట్టినప్పటి నుంచీ, చచ్చేదాకా ఏ శరీరం కోసం అనుక్షణం బ్రతుకుతామో ఈ శరీరం కాలి బూడిదై పోయింది. నా శరీరం, కుష్టి రోగి శరీరం, గజ్జి కుక్క శరీరం అన్నీ ఈ మట్టిలోనే కల్సిపోక తప్పదా? అలా ఎంతసేపు ఆలోచిస్తూ అక్కడే వున్నానో తెలీదు "ఎందుకు గురువుగారూ అంత బాధ

పడతారు? ముందుంది ఎయిడ్స్ పండగ... పెద్ద కర్మ అయ్యే పధ్నాలుగు రోజులపాటు ఇంకా చాలా సీన్ వుంది..." చూస్తే నా కంటే ముందు పోయిన సినీ రచయిత ఆరుమగం ఆత్మ. నేను అతను చెప్పేది విన్పించుకోకుండా ఇంటికి చేరాను. అంతే... ఆ క్షణం నుంచీ ఈ పదమూడు రోజులపాటు ఎంత క్షోభ అనుభవించానో నాకే తెలుసు. చూడకూడని దృశ్యాలు చూసాను. వినకూడని మాటలు విన్నాను. ఆత్మ బంధువులు అనుకున్నవాళ్ళే భార్యా బిడ్డలు డబ్బు, ఆస్తి కోసం ఎంత నీచంగా ప్రవర్తిస్తారో అర్థం అయింది. నరకం అంటే ఎక్కడో లేదు. ప్రస్తుతం నేను వుంది నరకంలోనే. చావు ఎవ్వరికీ తప్పదు... కానీ విచిత్రం ఏమంటే ఎవరికి వారు తాము శాశ్వతంగా వుండిపోతామనుకుంటారు... పధ్నాలుగవ రోజు తెల్లవారుఝాము నాలుగు గంటలు...

నేను గార్డెన్‌లోని నందివర్ధనం చెట్టు మీద కూర్చుని వున్నాను. అందరూ ప్రశాంతంగా నిద్రిస్తున్నారు. నాకు మాత్రం తీవ్రమైన వేదనే మిగిలింది. ఈ ఆస్తీ, హోదా, కార్లూ, భార్యాబిడ్డలూ ఇవన్నీ కేవలం పనికిరాని విషయాలేనా? మానవ జీవిత సాఫల్యం ఏమిటి? మనిషి ఎలా బ్రతకాలి? వీళ్ళంతా ఇంత నికృష్టంగా, నీచంగా ఎలా బ్రతుకుతున్నారు? నాకు గతం మెదిలింది. నేను మాత్రం తక్కువ వాడినా, తండ్రి శవం ముందు పెట్టుకుని తమ్ముడితో ఆస్తి కోసం రోడ్డుకు ఎక్కినవాడిని. అప్పుడు నా తండ్రి ఇలానే ఆత్మరూపంలో నా నికృష్టమైన ప్రవర్తన చూసి క్షోభించి వుంటాడా? డబ్బు, సుఖాలు, అహం, సెక్స్, పేరు, అమ్మాయిలు కోసం నేను ఎన్నో దుర్మార్గాలు, రాజకీయాలు నడపలేదా? తడిగుడ్డతో ఎందరి గొంతులు కోయలేదు? ఎన్ని రాక్షస కృత్యాలు చేయలేదు? ఇపుడు నాదాకా వచ్చేసరికి అందరూ దుర్మార్గులుగా కన్పిస్తున్నారు. నేను ఒకప్పుడు వీళ్ళలాగే బ్రతికిన వాడిని. అమ్మాయిల కౌగిళ్ళలోనే స్వర్గం వుందని భ్రమించినవాడినే.

మెదడులోని పొరలు ఫెటీలున పగులుతున్న అనుభూతి... అజ్ఞానపు చీకట్లు తొలుగుతూ దేదీప్యమైన జ్ఞానాన్ని దర్శించగలుగుతున్నాను. ఇంతవరకూ వున్న వేదన, దుఃఖం తొలగిపోతుంది.

ఆ క్షణంలో నాకో విశ్వజనవీయమైన సత్యం తెలిసింది...

తన కోసం, తన సుఖం, అహం, కామం కోసం బ్రతికేవాడు బ్రతికినా, చచ్చినా దుఃఖం, వేదన నుంచి తప్పించుకోలేడు. భౌతిక సుఖాల తాలూకు ఎండమావుల వెంట పరుగులు దాహాన్ని తీర్చలేవు. ఎవడైతే పది మంది కోసం బ్రతుకుతాడో, ఆర్తులు, బాధితులు, సర్వభ్రష్టుల కన్నీరు తుడవటానికి జీవిస్తాడో, ఇతరుల కష్టాలకు ఎవడి కంటి నుంచి రక్తకన్నీరు కారుతుందో, ఎవడు అహం, సెక్స్, డబ్బు, హోదా, పబ్లిసిటీ మురుగ్గుంటలలో పడిపోడో, ఎవడైతే పదిమందికి స్ఫూర్తినిచ్చేలా బ్రతుకుతాడో వాడికి దుఃఖం లేదు, వేదన రాదు. కష్టాలు దరి చేరవు. వాడే మనిషి... అదే నిజమైన మానవజన్మ పరమార్థం...

మిట్టమధ్యాహ్నం పన్నెండయింది. లోపల పిండప్రదానం తాలూకు మంత్రాలు విన్పిస్తున్నాయి... ఈ జన్మ తాలూకులన్ని బంధాలను, మాధలను తెంచేసుకోవాల్సిన సమయం వచ్చేసరికి ఆఖరిసారి భార్యాబిడ్డల్ని చూడాలన్పించింది. అంతలోనే వివేకం వెన్నుతట్టింది. ఎందరు భార్యలు వచ్చారో? ఎందరు బిడ్డల్ని కన్నానో? ఎవరికి బిడ్డగా పుట్టానో...

నిశ్చలమైన ఏకాగ్రతతో దైవస్మరణ చేసుకున్నాను. "వున్నావో లేదో తెలియని ఓ భగవంతుడా! మళ్ళీ నాకు జన్మ వద్దు... ఒక వేళ వచ్చినా మనిషి ఎలా బ్రతకాలో అలాంటి జ్ఞానాన్ని ఇవ్వు... పవిత్రతను ఇవ్వు... ప్రేమను ఇవ్వు... శక్తిని ఇవ్వు... సుఖాలు వద్దు... ఐశ్వర్యం వద్దు... గడ్డి పువ్వుగా పుట్టినా నా జన్మకొక పరమార్థం వుండే జీవితాన్ని ఇవ్వు..."

నా ప్రార్థన ముగిసిందో లేదో ఏదో ఆకర్షణ శక్తి లోనయి నేను శూన్యంలోకి విపరీతమైన వేగంతో ప్రయాణం ప్రారంభించాను. ఏదో నన్ను తన వైపు ఆకర్షిస్తుంది. అలా ఎన్ని సంవత్సరాలు, యుగాలు ప్రయాణించానో ఆ తర్వాత ఏమయిందో నాకు తెలీదు.

(ప్రేమకు ప్రతిరూపాలైన అమ్మానాన్నలకు–శివ)



**గుంటూరు శేషేంద్రశర్మ**

మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ 50 సం.లు తన సాహిత్య కృషిలో పూర్తి చేసిన శుభ సందర్భంలో, ఇండియన్ లాంగ్వేజస్ ఫోరం వారు ఈ క్రింద చూపిన ఆయన గ్రంథాల ధరలను వాటి ఎదుట చూపిన విధంగా తగ్గించడానికి నిర్ణయించారు. ఈ తగ్గించిన ధరలు 1.4.96 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ విషయం పుస్తక విక్రేతలకు రిజిస్టర్డు పోస్ట్ ద్వారా తెలుపబడింది.

**1. ఆధునిక మహాభారతము** రూ.30/-
(మామూలు కవరు, బైండు కవరు కూడా)

**2. జనవంశమ్** రూ.30/-
(మామూలు కవరు, బైండు కవరు కూడా)

**3. కవిసేన మేనిఫెస్టో** రూ.20/-

**- ఇండియన్ లాంగ్వేంజస్ ఫోరం**

**లభించు స్థలం:**

విశాలాంధ్ర బుక్ హౌస్, బాంక్ స్ట్రీట్, హైదరాబాద్ ● బుక్ పాయింట్, హిమాయత్‌నగర్, హైదరాబాద్ ● సి.ఎల్.ఎస్. (సిటీ లిటరరీ సొసైటీ), నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్ ● నవయుగ బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్.